జగనన్న పోరుబాటను విజయవంతం చేయాలి

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పొదిలి పొగాకు వేలం కేంద్రం పర్యటనకు రైతులు హాజరై విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు మోరా శంకర్‌రెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు కోరారు. మంగళవారం వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, పార్టీ నాయకులు ఉడుముల గురవారెడ్డి, ఏలూరి సంజీవరెడ్డి, ఎస్సీ, బీసీ సెల్ నాయకులతో కలిసి చినమనగుండం, కాట్రగుంట, తువ్వపాడు, కొనకనమిట్ల, మునగపాడు, వెలిగండ్ల, మంగాపురం గ్రామాల్లో పర్యటించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసేందుకు రైతులంతా కదలి రావాలని విజ్ఞప్తి చేశారు.

13న దేవదాయ భూముల కౌలు వేలం

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్లరంగనాయకస్వామి ఆలయ భూముల కౌలు బహిరంగ వేలం ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్నట్లు ఈఓ మల్లవరపు నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చోళ్లవీడు, చినగానిపల్లె, తురిమెళ్ల గ్రామాల్లోని భూముల కౌలు వేలం ఉదయం 9 గంటలకు, జేపీ చెరువు, అనుములపల్లె గ్రామాల్లో ఉదయం 10:30 గంటలకు, రాచర్ల, అనుమలవీడు గ్రామాల్లో 11:30 గంటలకు, రామాపురం, సోమిదేవిపల్లె గ్రామాల్లో 12:30 గంటలకు, అర్ధవీడు మండలంలోని రంగాపురం గ్రామంలో సాయంత్రం 3 గంటలకు భూముల కౌలు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు రూ.2 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

పశువైద్యాధికారికి సన్మానం


సాయి చక్రవర్తిని సన్మానిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్లు

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామంలో పశువైద్యాధికారిగా పనిచేస్తూ నెల్లూరు జిల్లా ఐఎస్‌డీపీకి బదిలీపై వెళ్తున్న డాక్టర్ వి.సాయి చక్రవర్తిని మంగళవారం స్థానిక సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్లు సన్మానించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు శివచరణ్‌గౌడ్, మురళి, కృష్ణప్రియ, ఓంకార్, ఫ్యాన్సీస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆయన స్థానంలో దర్శి మండలం రాజపల్లి పశువైద్యాధికారి పి.నాగమణి నియమితులయ్యారు.

పొగాకు రైతులకు మద్దతుగా నిలుద్దాం..

కూటమికి బుద్ధి చెబుదాం


బేస్తవారిపేట : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


గిద్దలూరులో కార్యకర్తలతో కేపీ నాగార్జునరెడ్డి

- పొగాకు రైతులకు అండగా నిలిచేందుకే జగనన్న పోరుబాట
- వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు పొదిలి తరలిరావాలి
- కూటమి ఏడాది వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్
- వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి

బేస్తవారిపేట: పొగాకు రైతుల పక్షాన పోరాటం చేసేందుకు బుధవారం ఉదయం పొదిలికి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నట్లు ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బేస్తవారిపేటలోని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి నివాసంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని, పొగాకు, మిర్చి రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైందన్నారు. ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైందని, ప్రజల దృష్టి మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు, జగనన్న పర్యటనను విజయవంతం చేసేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు పొదిలికి తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ కన్వీనర్ మల్లెల శేఖర్‌రెడ్డి, ఇంటలెక్షువల్ వింగ్ కన్వీనర్ బిక్కా రామాంజనేయరెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు డి.ఖాజామీయా, చిరంజీవి, సర్పంచ్ తిరుపతయ్యగౌడ్, మాజీ సర్పంచ్ కర్నాటి మోహన్‌రెడ్డి, నాయకులు బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొండా రఘునాథరెడ్డి, టీవీఎస్‌పీ శర్మ, బాలరంగయ్య, మాచర్ల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలిలో పొగాకు రైతులకు మద్దతుగా నిర్వహిస్తున్న పోరుబాటకు పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి కోరారు. గిద్దలూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జగనన్న పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. రైతుల పక్షాల పోరాడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఓబులరావు, పాలుగుళ్ల నరసింహారెడ్డి, నంద్యాల బాలుయాదవ్, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, పోలేపల్లె శివ, గోడి వెంకటేశ్వరరెడ్డి, మిత్రారెడ్డి, శివారెడ్డి, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాగుమడుగు పోలేరమ్మ తిరునాళ్ల

- వైఎస్సార్ సీపీ తరఫున నాలుగు విద్యుత్ ప్రభలు


పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి


ముస్తాబైన పోలేరమ్మతల్లి ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు గ్రామంలో బుధ, గురువారల్లో ఏరువాక పోలేరమ్మతల్లి తిరునాళ్ల వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఏటా జూన్ నెలలో వచ్చే ఏరువాక పౌర్ణమి రోజున గ్రామస్తులు అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బుధవారం నిలుపు ఉత్సవంతో జాతర ప్రారంభమవుతుంది. గురువారం అమ్మవారికి కుంకుమ బండ్లతో ఉత్సవం, నైవేద్యాలు సమర్పిస్తారు. తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నాలుగు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని రంగు రంగుల దీపాలతో అలంకరించారు. పలువురు దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణకు ఏర్పాట్లు చేశారు.

మార్కాపురంలో విద్యుత్ అధికారుల తనిఖీలు

- 58 కేసులు నమోదు.. రూ.1.97 లక్షల జరిమానా


తనిఖీల వివరాలు వెల్లడిస్తున్న ఏఈ నాగేశ్వరరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు 36 బృందాలుగా విడిపోయి సుమారు 1351 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ మీటర్లు లేకుండా అనధికారికంగా వాడుతున్న 13 మందిపై డైరెక్ట్ ట్యాపింగ్ కేసులు, 30 మందిపై అడిషనల్ లోడ్ కేసులు, కేటగిరీ మార్పు చేయని 15 మందిపై మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు చేశారు. మొత్తం 58 కేసులకు సంబంధించి రూ.1.97 లక్షల జరిమానా విధించారు. తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీపీఈ ఉషారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సియా నాయక్, కంభం, గిద్దలూరు, యర్రగొండపాలెం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, మార్కాపురం ఏఈ పీవీ నాగేశ్వరరావు, వివిధ మండలాల విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేతివృత్తులతో ఉపాధి అవకాశాలు

కొమరోలు: చేతి వృత్తులతో మహిళలు ఉపాధి పొందవచ్చని రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొమరోలులో రూడ్‌సెట్ ఆధ్వర్యంలో మహిళలకు రెండు వారాలపాటు జనపనార సంచుల తయారీపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు సందర్భంగా మంగళవారం రూడ్‌సెట్ ఆధ్వర్యంలో 32 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు, బహుమతులను సంస్థ డైరెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో మహేంద్ర, సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

అర్ధవీడు: మండల కేంద్రమైన అర్ధవీడులో అంగన్‌వాడీ కేంద్రం-5లో మంగళవారం కిశోరి వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.రమీజాబీ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కొమరోలు: మండలంలో ప్రతి గ్రామాన్ని నాటు సారా రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మార్కాపురం ఎక్సైజ్ డీఎస్పీ బలరామ్ తెలిపారు. మండలంలోని ముత్రాసుపల్లె గ్రామంలో మంగళవారం ఎక్సైజ్, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ జయరావు, కొమరోలు ఎస్సై నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపుపై విచారణ


ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారిస్తున్న ఎంపీడీఓ

బేస్తవారిపేట: మండలంలోని గంటాపురం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన కె.వెంకటేశ్వరరెడ్డి తొలగింపుపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ మంగళవారం విచారణ చేపట్టారు. సోషల్ ఆడిట్ నివేదికలోని అంశాలపై బసినేపల్లె సచివాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ తీసుకున్నారు. ఎనిమిది నెలల క్రితం సోషల్ ఆడిట్ నివేదిక ఆధారంగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించామని, దీనిపై ఆయన కోర్టుకు వెళ్లడంతో విచారణ చేపట్టి నివేదిక పంపాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. ఏపీఓ గురువరకుమార్, ఈసీ నాగేశ్వరరావు, టీఏ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోసుపల్లెలో క్షుద్రపూజల కలకలం



కొమరోలు: మండలంలోని పోసుపల్లె గ్రామ సమీపంలో క్షుద్రపూజల సంఘటన మంగళవారం కలకలం రేపింది. పోసుపల్లె నుంచి సూరవారిపల్లె వెళ్లే రహదారిలో నడిరోడ్డుపై పసుపు, కుంకుమ కలిపి బొమ్మలు తయారు చేసి వాటిని ముగ్గులో ఉంచారు. మంగళవారం తెల్లవారుజామున పొలాలకు వెళ్తున్న రైతులు చూసి కలవరపాటుకు గురయ్యారు. క్షుద్రపూజలు చేసిన వారిని శిక్షించాలని పోలీసులను స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులకు జైలు, జరిమానా

బేస్తవారిపేట: బేస్తవారిపేట మండల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో ఐదుగురికి మంగళవారం గిద్దలూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.భరత్‌చంద్ర జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తెలిపారు. ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా, ఇద్దరికి రెండు రోజులు, ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించడంతో పాటు ఆరు నెలలపాటు లైసెన్స్ రద్దు చేస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని వివరించారు.

అర్ధవీడులో ఇద్దరికి..

అర్ధవీడు: మండల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో ఇద్దరు నిందితులకు మంగళవారం గిద్దలూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.భరత్‌చంద్ర శిక్ష విధించారని ఎస్సై మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. ఒకరికి రూ.10 వేల జరిమానా, మరొకరికి ఐదు రోజుల జైలుతోపాటు ఆరు నెలలపాటు లైసెన్స్ రద్దు చేశారని వివరించారు.